క్లుప్తంగా

మొహర్రం వేడుకలు ప్రారంభం



దాచేపల్లి: మొహర్రం పండుగ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆకాశంలో నెలవంక కనిపించటంతో చావిడిలలో భద్రపరచిన పీర్లను అలంకరించారు. దాచేపల్లిలోని గంధం పీర్లతో పాటుగా మండలవ్యాప్తంగా చావిడిలలో ఉన్న కట్టిపీర్లను శుభ్రం చేసి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పీర్లను దర్శించుకుని బెల్లం, బొరుగులు సమర్పించారు. చావిడిలలో పీర్లను అలంకరించిన సమయంలో మేళాతాళాలతో సందడి చేశారు. ముజావర్లు ప్రత్యేకంగా నమాజ్ చేశారు.

క్రీస్తు సంఘ ప్రార్థన మందిరం ప్రారంభం



మాచర్ల: పట్టణంలోని వినాయకుని గుట్ట ప్రాంతంలో నూతన క్రీస్తు సంఘ ప్రార్థన మందిరాన్ని సంఘ సువార్తికులు వేల్పుల ఏసుదాసుతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణ బాబు గురువారం ప్రారంభించారు. ముఖ్య ప్రసంగీకులుగా దైవ సేవకులు పార్థసారధి, ఎలకపాటి అశోక్, చక్రవర్తిలు దేవుని వర్తమానాన్ని అందించారు. అనంతరం ప్రేమ విందు జరిగింది.

నేడు రెంటచింతలలో జగనన్న సురక్ష

రెంటచింతల: జగనన్న సురక్ష క్యాంపు శుక్రవారం రెంటచింతల గ్రామంలోని సచివాలయం-1లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి గురువారం తెలిపారు. తహసీల్దార్ కె.పుల్లారావు, ఈవోపీఆర్డీ సీహెచ్ రామచంద్రావు, డిప్యూటీ తహసీల్దార్ జే.రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.నరేంద్రరెడ్డిలు పాల్గొని సంక్షేమ పథకాలు అందని అర్హుల అర్జీలు పరిష్కరించి, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారన్నారు. గ్రామానికి చెందిన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందరూ తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ లోక్ అదాలత్

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం, విద్యుత్ శాఖ భవనం ప్రాంగణంలో నేడు జరిగే విద్యుత్ లోక్ అదాలత్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈఈ జె.హరిబాబు, డీఈ రామయ్యలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ లోక్ అదాలత్‌ను సీజీఆర్ఎఫ్ చైర్మన్, జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానియేలు, ఫోరం సభ్యులు ఎస్ఈ ఆపరేషన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి జరిగే లోక్ అదాలత్‌ను వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, విద్యుత్ బిల్లులు, అన్ని సమస్యలు పరిష్కరించే అవకాశముందన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులైన పిడుగురాళ్ల, రాజుపాలెం, బెల్లంకొండ మండలాలోని విద్యుత్ వినియోగదారులకు మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించటం జరుగుతుందని ఏడీఏ బాబ్జినాయక్ తెలియజేశారు. వినియోగదారులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించటమే కాకుండా, ఫిర్యాదులను ఆలకించి, సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సెకండ్ సెమిస్టర్ పుస్తకాల పంపిణీ



నాదెండ్ల: ఈ విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా శాఖ నుండి సెకండ్ సెమిస్టర్ ఉద్యోగాలు ఈ నెల 22న రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసేందుకు అన్ని పాఠశాలలకు వాహనాల ద్వారా శుక్రవారం అందించారు. సెకండ్ సెమిస్టర్‌కు గాను 17 వేల పుస్తకాలు ఆయా పాఠశాల హెచ్ఎంల చేతుల మీదుగా అందించనున్నట్లు ఎంఈవో ఆంజనేయులు, ఈమని కృష్ణారెడ్డి తెలిపారు. ఒకటి-తొమ్మిదో తరగతుల వరకూ 6,7 తరగతులకు మాథ్స్, సైన్స్, సోషల్, ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో 9వ తరగతి మాత్రం పూర్తిగా మారిన సిలబస్‌తో, ఈ ఏడాది హిందీ నాన్‌టెయిల్ కూడా పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

పేదరికమే సంక్షేమ పథకాలకు ప్రామాణికం

- కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ పథకాల లబ్ధి కరపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి

కారెంపూడి: రాష్ట్ర చరిత్రలో పార్టీ, కుల, వర్గాలు చూడకుండా అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) స్పష్టం చేశారు. మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే నిర్వహించారు. తిరుపతమ్మ తల్లి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని పీఆర్కే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడకుండా గ్రామంలోనే రైతులకు విత్తనాల నుంచి ఎరువుల దాకా అందించేందుకు రైతులకు అవసరమైన సాగు సమాచారాన్ని అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతుకు వైఎస్సార్ రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. గ్రామంలో గ్రామ సచివాలయంతో పాటు ఆర్బీకే సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం కూడా త్వరలో పూర్తవుతుందన్నారు. వీటితో పాటు సీసీ రోడ్లు నిర్మించి ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం పేటసన్నెగండ్ల గ్రామంలోని ప్రధాన వీధిలో ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా గ్రామంలో 7,159 మందికి రూ. 153. 43 కోట్లు అందించడం జరిగిందన్నారు. ఆసరా ద్వారా 805 మందికి, అమ్మ ఒడి ద్వారా 598 మంది చిన్నారుల తల్లులకు, పెన్షన్లు 720 మందికి, రైతు భరోసా 607 మందికి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కులాలు, పార్టీలు ఇతర తరతమ భేదాలు లేకుండా అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. రాజకీయాలు చూడకుండా ప్రతి కుటుంబం బాగుండాలని అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఏమైనా సమస్యలున్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంక్షేమం అభివృద్ధి ఇలాగే కొనసాగేందుకు జగనన్నకు మద్దతుగా నిలవాలని ప్రజలకు పీఆర్కే విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాస రెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి సుబ్రహ్మణ్యం, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం ఆదిశేషగిరిరావు, మాజీ సర్పంచ్ నర్సింగ నాగేశ్వరరావు, గ్రామ నాయకులు మాచర్ల ఏడుకొండలు, వెన్నపూసల బుల్లెబ్బాయి, నేలపాటి నరసింహారావు, వీరయ్య, బెల్లంకొండ ముత్తయ్య, జవ్వాజి బాలరాజు, తోడేటి సుబ్బారావు, మామిడి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఆర్కే

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



మాచర్ల రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలు నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఆనందరాజు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఓలుగా నియమించాలని, అర్హులైన వారందరికీ అటెండర్, వాచ్‌మెన్ పదోన్నతులు కల్పించాలని, డీఏ రికవరీ నిలిపి, డీఏతో కూడిన వేతనం అమలు చేయాలన్నారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు తీగల రామారావు, ఉపాధ్యక్షుడు ఈషావలి, కార్యదర్శి మారపాకుల శ్రీనివాసరావు, కోటయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

దాచేపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడు సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ జంగా పాల్గొన్నారు. పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిరుపేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని, పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని, ఏ పథకం కావాలన్నా ప్రజల నుంచి లంచాలు వసూలు చేసేవారని ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వలంటీర్, గ్రామ సచివాలయం వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి ప్రజల సమస్యలన్నింటిని సత్వరమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పారదర్శకమైన పాలన అందిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా అధికారులు, సచివాలయం సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్సీ జంగా కోరారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీడీఓ శోభారాణి, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, ఉపసర్పంచ్ షేక్ పెద హుస్సేన్, వీఆర్ఓ పత్రా రమేష్, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విజయపురిసౌత్‌లో...

విజయపురిసౌత్: అర్హులైన ప్రతిఒక్కరికీ 100 శాతం సంక్షేమ పథకాలు అందించటానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు అన్నారు. గురువారం విజయపురిసౌత్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అత్యంత తక్కువ సమయంలో పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు ఇస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు, జెడ్పీటీసీ మల్లుస్వామి, ఉప ఎంపీపీ సుజాత కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరావు పాల్గొన్నారు.



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

గామాలపాడులో ...

దాచేపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శోభారాణి అన్నారు. మండలంలోని గామాలపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ జంగా సైదులు, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, ఉప సర్పంచ్ షేక్ పెదహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేమవరంలో...

మాచవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలకు పరిష్కారం లభించిందని జడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఎంపీడీఓ వరప్రసాద్, ఈఓఆర్డీ వెంగళరావు, సర్పంచ్ గాదె కనకారెడ్డి, ఎంపీటీసీ శానంపూడి లక్ష్మినర్సమ్మ శ్రీనివాసరెడ్డి, నాయకులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాయవరంలో...

మాచర్ల రూరల్: సర్టిఫికెట్లు పొందేందుకు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసలకోర్చే రోజులు పోయి జగనన్న సురక్ష ద్వారా గంటల వ్యవధిలో సర్టిఫికెట్లు అందుకునే సువర్ణ అవకాశాన్ని ప్రభుత్వం అందిస్తోందని తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాయవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు చామకూర వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ పి.సుందరలీల, ఎంపీటీసీ సైదయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ బూడిద శ్రీను



శ్రీరాంపురంతండాలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

మూడు గ్రామాల్లో...

వెల్దుర్తి: పేదలు అర్హత ఉండి సంక్షేమ పథకాలను వివిధ సాంకేతిక కారణాల వలన కోల్పోతే 11 సేవలను జగనన్న సురక్ష ద్వారా పేదలకు అందించేందుకు వరంగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాంపురంతండా, వెల్దుర్తి, రచ్చమల్లపాడు గ్రామాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని. అర్హులైన 264 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. గ్రామ సర్పంచ్‌లు దేరంగుల ఏగయ్య, తోట బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్‌లు పార్లపల్లి గాలయ్య, కేతావత్ హనుమానాయక్, పాత్లావత్ లక్ష్మానాయక్, ఎంపీటీసీ పార్లపాటి వెంకట్రామయ్య, పులుసు నారాయణరెడ్డి, కేసిరెడ్డి వెంకటరెడ్డి, జూలకంటి నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల వికాసంపై ప్రత్యేక శ్రద్ధ

కారెంపూడి: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల శారీరక, మానసిక వికాసం పట్ల అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ జి.శ్రీనివాస్ కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు తహసీల్దార్ తన సొంత నగదుతో గురువారం ఏడు చిన్న సైకిళ్లను బహూకరించారు. చిన్నారుల శారీరక వికాసం కోసం తహసీల్దార్ వీటిని చిన్నారులకు అందించారు. వయస్సుకు తగ్గట్లుగా చిన్నారులు ఎత్తు, బరువు పెరిగేలా అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించి, దానికి తగినట్లుగా వారి శారీరక మానసిక వికాసానికి అవసరమైన కృత్యాలు చేయించాలని, వారిలో సృజనాత్మకతను పెంపొందించే విధంగా మంచి కథలతో కూడిన ప్రీప్రైమరీ విద్య ఉండాలని సూచించారు. ప్రాథమిక విద్యకు వారిని ఇక్కడ సమర్థవంతంగా సిద్ధం చేస్తే పాఠశాలలో వారు చూపే ప్రతిభ అద్భుతంగా ఉంటుందన్నారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను తహసీల్దార్ శుభ్రం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.



చిన్నారులకు సైకిళ్లు బహూకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చదరంగంతో జ్ఞాపకశక్తి మెరుగు

మాచర్ల: చదరంగం ఆటతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని అర్బన్ సిఐ టి.బాలకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ, లక్ష్మీచెన్నకేశవ మాచర్ల క్లబ్‌ల ఆధ్వర్యంలో పల్నాడు చెస్ అకాడమీ కోచ్ కె.క్రాంతి కిరణ్‌ను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న మేధాశక్తిని బయటకు తీసేందుకు చెస్ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందని, వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో ఎంతో మంది విద్యార్థులకు చెస్ క్రీడను నేర్పించి వారికి రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించి పెట్టిన చెస్ కోచ్ కిరణ్ క్రీడా స్ఫూర్తి, సేవా గుణం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, మేడా వెంకట లక్ష్మి, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు, ముప్పవరపు నాగేశ్వరరావు తదితరులున్నారు.

మాచర్ల: చరిత్రలో అత్యంత పురాతనమైన ఆట చదరంగం అని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బ్రాంచి డెవలప్‌మెంట్ మేనేజర్ రామకృష్ణ అన్నారు. గురువారం ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థుకు చెస్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అండర్ 11 బాలికల్లో దీక్షితరెడ్డి, బాలురులో అక్షిత్‌వర్ధన్, అండర్ 13 బాలికల్లో యువశ్రీలు మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెస్ కోచ్ కిరణ్‌ను సత్కరిస్తున్న అర్బన్ సీఐ టి.బాలకృష్ణ

నేటి నుంచి ఓటు నమోదు ఇంటింటి సర్వే

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నుంచి ప్రత్యేక సమ్మరి రివిజన్‌లో భాగంగా బూత్ లెవల్ అధికారులు ఓటు నమోదుకోసం ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్‌స్థాయి అధికారులు(బీఎల్ఓ) వారి పరిధిలోని ప్రతి ఇంటికి ఖచ్చితంగా వెళ్లి అర్హత ఉన్న వారికి ఓటు నమోదు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా సరిచేయడంలో భాగంగా ఈ నెల 21 నుంచి ఆగష్టు 21వరకు స్పెషల్ సమ్మరి రివిజన్ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. బీఎల్ఓలు ఎప్పటికప్పుడు ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన వివరాలను తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 40,584 మంది ఓటర్లు, కాగా వారిలో పురుషులు 19,621 మంది, మహిళలు 20,960 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారని తెలిపారు.

మాచవరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బూత్ లెవెల్ ఆఫీసర్లదని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వి.భూషణం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటు నమోదు కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపట్టి చేర్పులు, మార్పులు, తొలగింపులను ఆయా కుటుంబాల ఆమోదం మేరకు సవరించాలన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా ఓటరు జాబితాలను తయారు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. పలువురు నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటు చేయాలని వినతి

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీకి అనుసంధానంగా ప్రభుత్వ హాస్టల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఏయాలని పీడీఎస్‌వో నాయకులు ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు వస్తుంటారని, వారికి ప్రభుత్వ హాస్టల్ వసతి ఉంటే బాగుంటుందని పీడీఎస్ఓ నాయకులు తెలియజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.బాను, ఎస్‌వైఎస్ జిల్లా నాయకుడు కె. శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.



డీటీ ధనలక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్ఓ నాయకులు

నూతన వైద్యాధికారిగా రాధాకృష్ణన్

శావల్యాపురం: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా యం.రాధాకృష్ణన్ నియమాకం అయినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డ్రాయింగ్ అధికారి వేముల వెంకట భాస్కర్ గురువారం తెలిపారు. నూతన వైద్యాధికారి రేపల్లె మండలం ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వస్తున్నట్లు చెప్పారు.

క్రీడా సామగ్రి పంపిణీ

నాదెండ్ల: ప్రతి ఏడాది బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బరోడా బ్యాంక్ మేనేజర్ జయకర్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.10 వేలు విలువైన క్రీడా సామగ్రిని ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణికి అందించారు. ముందుగా బ్యాంకు ఆవరణలో కేక్ కట్ చేసి సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకు చేస్తున్న సేవలను ఖాతాదారులకు వివరించారు. ప్రతి ఏడాది విద్యా వ్యాప్తికి పాఠశాలలకు ఫర్నీచర్, విద్యా, క్రీడాసామాగ్రి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ మేనేజర్ నాగయ్య, పీఎంసీ చైర్మన్ శంకరరెడ్డి, పీఈటీ జాస్తి శ్రీకాంత్, పీడీ వేణుగోపాల్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలకు క్రీడాసామగ్రి అందిస్తున్న బ్యాంకు సిబ్బంది

మిరప మొక్కలను నష్టపరిచిన కేసులో ఇద్దరి అరెస్టు

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో శ్రీ రామాంజనేయ నర్సరీలో మొక్కలకు గడ్డిమందు కలిపి నష్టపరిచిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.శ్రీహరి గురువారం తెలిపారు. ఈ కేసులో ఐదుగురిపై కేసు నమోదు కాగా, వీరిలో రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన సర్వారెడ్డి, ఉప్పాలపాడుకు చెందిన వంశీలను అరెస్టు చేసి మాచర్ల మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

జాబ్‌కార్డు కూలీలు ఆధార్ అనుసంధానం చేయాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: ఉపాధి పథకంలో జాబ్‌కార్డు కల్గిన కూలీలు తప్పనిసరిగా ఆధార్‌కు అనుసంధానం చేయాల్సిన ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై ఉందని వినుకొండ క్లస్టర్ ఏపీడీ ఈవూరి బూసిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల 38 వేల 349 మంది కూలీలకు పనిదినాల కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 2 లక్షల 10 వేల 523 మందికి పనిదినాలు కల్పించామన్నారు. మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా ప్రస్తుతం 6 పంచాయతీల్లో కూలీల వివిధ రకాల పనులు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో బొల్లాపల్లి, వినుకొండ, నూజెండ్ల మండలాల్లో రోజుకు 3 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన చిన్న-సన్నకారు రైతులందరూ నీటి వసతి ఆధారంగా ఉద్యాన పంటల సాగువైపు ఆసక్తి చూపాలన్నారు. ఈ సాగు చేసిన ఒక్కో రైతుకు మూడు సంవత్సరాల సాగు ఆధారంగా రూ.1.50 వేల రూపాయలు ఉపాధి పథకం మంజూరు చేస్తుందన్నారు. మండలంలోని శానంపూడి గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్కపోగు పెద గంగయ్య 2021 ఆగస్టు నెల నుంచి విధుల్లోకి హాజరు కాకపోవడంతో పాటు వేతనం నిలుపుదల చేశామని, సీనియర్ మెట్ పర్యవేక్షణలో గ్రామంలో ఉపాధి పనులు చేయిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీ కొని వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొనటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాయవరం గ్రామ జంక్షన్‌లో గురువారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయవరం జంక్షన్‌లో కెఎస్ఆర్ నగర్ వద్ద రోడ్డు దాటుతున్న ముఖేష్(30)ను రాయవరం వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో రోడ్డుపై పడ్డ ముఖేష్ తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందాడు. మృతుడుముఖేష్ జాతీయ రహదారుల పని నిమిత్తం బీహార్ రాష్ట్రంలోని, జమ్ము జిల్లా, వరియా గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.